క్లుప్తంగా

శ్రావణ అమావాస్య పూజలు


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

త్రిపురాంతకం: శ్రావణ మాసం అమావాస్య సందర్భంగా శనివారం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

వ్యవసాయంలో అధునాతన పద్ధతులు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ

త్రిపురాంతకం: అధునాతన పద్ధతులు పాటించి వరి పంటను పండించాలని వ్యవసాయాధికారి సంఘమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మేడపిలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటను పండించే రైతులు కలుపు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరి పొలాల్లో ఎరువుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తెగుళ్ల ఉధృతి కాకుండా తగిన సమయంలో స్పందించాలని సంఘమేశ్వరరెడ్డి వివరించారు. వ్యవసాయ సహాయకులు లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం దారుణం


ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వ పెద్దలు దివ్యాంగుల పింఛన్లు తొలగించి పైశాచిక ఆనందం పొందుతున్నారని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య అన్నారు. దివ్యాంగుల పింఛన్లు తొగించినందుకు నిరసనగా శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట వికలాంగులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి పింఛన్లు పొందుతున్నా తమ వైకల్యం ఇప్పుడు కళ్లకు కనిపించడం లేదా..అని ఆయన ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డి.మంజునాథరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఆ సంఘ నాయకులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య, కనమాల కోటేశ్వరరావు, చేదూరి సుధాకర్, డి.పరంజ్యోతి, ఎం.సుబ్బయ్య, సీహెచ్ పోలయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరు సర్పంచ్ మృతి


ఆదిలక్ష్మి (ఫైల్)

ముండ్లమూరు (దర్శి): పాముకాటుకు గురై ముండ్లమూరు గ్రామ సర్పంచ్ వద్ది పోగు ఆదిలక్ష్మి మృతి చెందారు. ఈ సంఘటన శనివారం జరిగింది. తెల్లవారుజామున మొక్కజొన్నకు బలం మందు వేస్తుండగా ఆమె కాలిపై పాము మూడు చోట్ల కాటు వేసింది. వెంటనే బంధువులు ఆమెను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. 2021లో టీడీపీ మద్దతుతో సర్పంచిగా ఆదిలక్ష్మి ఎన్నికయ్యారు.

పొగాకు నాట్లు ప్రారంభం


పొగాకు నాటుతున్న కూలీలు

దొనకొండ (కురిచేడు): ఇటీవల కురిసిన తేలిక పాటి వర్షాలకు భూమి పదునెక్కింది. దీంతో రైతులు పొగాకు నాట్లపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని గంగదేవిపల్లి, పెద్దగుడిపాడు, ఇండ్లచెరువు, రుద్రసముద్రం, మంగినపూడి, వెంకటాపురం, సంగాపురం, వీరేపల్లి, వద్దిపాడు, పోలేపల్లి గ్రామాల్లో రైతులు పొగాకు నాట్లు ప్రారంభించారు. ఎకరా పొగాకు నాటాలంటే రూ.3 వేలు పొగాకు నారు, నాటినందుకు కూలీలు రూ.2 వేలు, ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరాకు రూ.1500 ఖర్చు అవుతుందని రైతులు చెప్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా నీరు పోసి కూలీలు పొగాకు నాట్లు వేస్తున్నారు. పొగాకు సాగు చేసే రైతులను పలకరించగా ఈ అదును చాలా బాగుందని తెలిపారు. గతేడాది మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. ప్రారంభంలో ధర ఆసక్తికరంగా ఉంది. రాను రాను పొగాకు ధర డీలా పడిపోయింది. ఈ ఏడాది పొగాకు ధర లేకపోవడంతో రైతులు ఎక్కువ భాగం సాగు చేసే పరిస్థితి లేదు.

మట్టి గణపయ్యలే బెటర్

- భక్తులు పర్యావరణాన్ని పరిరక్షించాలి
- సిద్ధమైన వినాయక విగ్రహాలు
- పీఓపీ విగ్రహాలతో హానికరం


మట్టి విగ్రహాలు తయారు చేస్తున్న లక్ష్మీనారాయణ

పుల్లలచెరువు: పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు గణనాథుడు. వినాయక చవితి వచ్చిందంటే చాలు పిల్లల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా విగ్రహాలు ఏర్పాటు చేసి పూజిస్తారు. వర్షాలు సుభిక్షంగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సంతోషంగా జీవించాలని, కోరిన కోర్కెలు నెరవేరాలని గణపయ్యను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి చలువ పందిళ్లు వేసి రంగు కాగితాలు, విద్యుద్దీపాలతో ఆధ్యాత్మిక భావాలతో కనీసం 9 రోజుల పాటు పెద్దలు, పిల్లలు సైతం పల్లెల్లో ఉత్సాహంగా చేసుకునే చవితి పండుగ ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు.

పీఓపీతో కాలుష్యం

వినాయక చవితి పండగ వస్తే గ్రామాలు, పట్టణాల్లో పీఓపీతో తయారు చేసిన వివిధ ఆకృతుల్లో ఉన్న అతి పెద్ద విగ్రహాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించే వారు. ఈ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడంతో ఆ నీటిని పశువులు, మూగజీవాలు తాగి అనారోగ్యం పాలవుతున్నాయి. అందుకోసం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజిస్తే మంచిదని సోషల్ మీడియా, వివిధ చానళ్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ప్రచారం చేస్తున్నారు. భాద్రపద మాసం శుక్ల పక్షం చతుర్థి రోజు జరుపుకునే వినాయచవితి హిందువులకు ఎంతో విశిష్టమైంది. పురాణాల ప్రకారం గణేశుడు మట్టితో చేసిన ప్రతిమ రూపంలోనే దర్శనమిస్తాడు. మట్టి గణపతిని పూజిస్తే అనేక యుగాలు ఫలితాలు పొందుతారని పండితుల అభిప్రాయం. మట్టి గణపతితో పాజిటివ్ ఎనర్జీ లభిస్తోంది. మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా పూజాఫలం కూడా లభిస్తుందని పండితులు చెబుతున్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం



వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంలో అనవసరమైన అడంబరాలు వద్దు. భారీ విగ్రహాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగుల రసాయనాలతో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. రసాయన విగ్రహాలు నిమజ్జనం చేస్తే జలచరాలు మృత్యువాత పడతాయి. చిన్న మట్టి విగ్రహం ఏర్పాటు చేసి పూజించినా ఫలితం ఉంటుంది. పూజల పేరుతో ఇతర జీవరాసుల మనుగడకు హాని కలిగించే పనిచేయవద్దు.

– ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్ డాక్టర్ సంధ్యారాణి


మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యారాణి

దర్శి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి వ్యవసాయ అధికారులకు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ, సందర్శన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు రైతులు కంది, పెసర పంటల్లో అంతర సేద్యం చేసుకోవాలని, ఎరువులు, కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సూచించారు. ఆగస్టు మాసానికి కంది, పెసర, మినుము, వరి, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటల్లో తీసుకోవాల్సిన ఎరువులు, కలుపు నివారణ చర్యల గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సూచనలు అందించారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రతినిధి రజనీ కుమారి మాట్లాడుతూ మెట్ట పంటలకు ఈ నెలలో కురిసిన వర్షం ఉపయోగపడుతుందని, శాస్త్రవేత్తల సలహాలను అనుసరించి పంటల్లో యాజమాన్య పద్ధతులు చేపడితే నాణ్యమైన దిగుబడులు తీసుకోవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ మాసం వరకు జొన్న పంట వేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ పరిశోధన స్థానం సస్యరక్షణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుతం పంటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల గురించి వాటి యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యల గురించి తెలిపారు. వరి, కంది, మొక్కజొన్న, మినుము, మిరప పంటలను ఆశించే ముఖ్యమైన పురుగులు, తెగుళ్ల వాటి లక్షణాలు, నివారణ పద్ధతుల గురించి వివరించారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, దర్శి, సింగరాయకొండ, ఎర్రగొండపాలెం, ఒంగోలు మండలాల నుంచి హాజరైన ఆదనపు వ్యవసాయ సంచాలకులు తమ వ్యవసాయ సబ్ డివిజన్లో ఉన్న వ్యవసాయ స్థితిగతులు, పంట విస్తీర్ణం, వర్షపాతం వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ మండలాల వ్యవసాయాధికారులు వ్యవసాయ పరిశోధనా స్థానం రీసెర్చ్ అసోసియేట్స్ హరిత, డాక్టర్ సుమన్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, అభరణాలు, పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. సంతానం కలగాలని స్వామి వారికి మొక్కులు చెల్లించి గిరికొండ చుట్టూ దంపతులు ప్రదక్షిణలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జీవితంలో విద్యే కీలకం


మాట్లాడుతున్న తూము రమణారెడ్డి

దర్శి: జీవితంలో విద్యే అంత్యంత కీలకమని అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో ఎక్స్‌పెడియా గ్రూప్ గ్లోబల్ కంపెనీ సీటీఓ తూము రమణారెడ్డి అన్నారు. స్థానిక కిజిజి పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. తాళ్లూరు మండలం లక్కవరం గ్రామానికి చెందిన రమణారెడ్డి అమెరికాలో స్థిరపడి సాఫ్ట్‌వేర్‌గా మంచి గుర్తింపు పొందారు. పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఉత్తేజ పూరిత ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎలా ఉండాలి? ఎలా చదవాలి? ఎటువంటి లక్ష్యాలు కలిగి ఉండాలో వివరించారు. తాను జీవితంలో ఎదిగిన అనుభవాలతో కూడిన కథలతో విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. పాఠశాల విద్య వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైందని, ఈ దశలోనే తన భవిష్యత్‌కు సరైన మార్గాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి వాటితో కాలాన్ని వృథా చేయకుండా తమ లక్ష్యాల వైపు ప్రయాణించాలన్నారు. విద్యార్థుల అనేక ప్రశ్నలకు ప్రేరణతో కూడిన సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల సమయపాలన, స్పష్టమైన లక్ష్యాలతో శ్రమించి ముందుకు సాగాలన్నారు. పాఠశాల డైరెక్టర్ కేతు రమణారెడ్డి, ఆంథోని పాల్గొన్నారు.

కిడ్నీ రోగి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని కట్టసింగన్నపాలేనికి చెందిన దొంతులూరి మరియబాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కుటుంబ పెద్ద లేవలేని పరిస్థితుల్లో కుటుంబం ఆర్థికంగా దెబ్బతింది. కుటుంబ దీనస్థితిని చూసి అతని భార్య మరియమ్మకు ఆ ఊరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు వేణు, హైమావతి, శ్రీనివాసులు, రవికుమార్‌లు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికంగా ఆదుకున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

త్రిపురాంతకం: మండలంలోని మేడపి, గణపవరం విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్..

దర్శి: బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం సాక్షి దినపత్రికలో 'పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి ఎక్సైజ్ పోలీసులు స్పందించారు. తాళ్లూరు మండలంలో మద్యం అక్రమంగా విక్రయించడాన్ని నిరోధించడంలో భాగంగా దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాళ్లూరు మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడులు జరిపారు. కొత్తపాలెం చప్టా సమీపంలో మద్యం అమ్ముతున్న శ్రీనివాసరెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎనిమిది నెలల కాలంలో తాళ్లూరు మండలంలో దాడులు చేసి 107 బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. 108 మందిపై కేసులు నమోదు చేసి సుమారు 1300 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 26 కేసులు నమోదు చేశామని, 80 మందిని బైండోవర్ చేశామన్నారు. దర్శి ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌ఐ సత్యనారాయణరావు, యూసఫ్ షరీఫ్, సిబ్బంది నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేజీబీవీల పరిశీలన


విద్యార్థులతో ముచ్చటిస్తున్న దేవానందరెడ్డి

దర్శి: నియోజకవర్గంలోని కేజీబీవీలను సమగ్ర శిక్షా సెక్రటరీ దేవానందరెడ్డి శనివారం పరిశీలించారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు కేజీబీవీలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో విజయపథం అనే రోజువారీ పరీక్షల తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అకడమిక్ విషయాలపై ఉపాధ్యాయులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులతో ముచ్చటించి స్కూల్ సౌకర్యాలు, పాఠ్యాంశాల వివరాల గురించి వాకబు చేశారు. మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలల్లో జరిగే సివిల్ వర్కులు, సైన్స్‌ల్యాబ్‌లు పరిశీలించారు. దేవానందరెడ్డి మాట్లాడుతూ 6 నుంచి 9 వరకు బేసిక్ విద్య, డిక్టేషన్‌లు కండెక్ట్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. భాషా నైపుణ్యాలను పెంపొందించాలని ఆదేశించారు. ప్రిన్సిపాళ్లు యర్రంశెట్టి అరుణ, ఆవుల సునీత, ఎస్.పద్మావతి, సుజిత పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు


చిన్నదోర్నాలలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: అలివి కాని హామీలతో చంద్రబాబు ప్రజలను మోసగించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్నదోర్నాలలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, గుండారెడ్డి రమణారెడ్డి, చింతల చెరువు వెంకటరెడ్డి, గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి, చింతల చెరువు శివారెడ్డి, జంకె సుబ్బారెడ్డి, పెద్దిరాజులు ఖాశింపీరా, యలకపాటి విశ్వం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఈడీ


పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

దర్శి: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఝాన్సీ లక్ష్మీ నర్సింగ్ హోం డైరెక్టర్ రెడ్డి ఝాన్సీ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి ఝాన్సీ మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, జ్వరాలు, డెంగీ, కండ్లకలక రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రభుత్వ వైద్యశాల లింక్ వర్కర్‌లు ఐ.సుబ్బారావు, పొదిలి ఔట్ రీచ్ వర్కర్ ఎస్.శిరీష మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి వ్యాపించే విధానం, ఆ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్, కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ కె.నరేష్, ఇంగ్లిష్ అధ్యాపకుడు డాక్టర్ నగేష్, తెలుగు అధ్యాపకుడు గంధం వేణు, జువాలజీ లెక్చరర్ వి.సుజాత, కామర్స్ అధ్యాపకుడు బి.సారీలమ్మ పాల్గొన్నారు.

దర్శి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం దర్శి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు పీకేసి చెత్త, చెదారం ఎత్తేశారు. స్టేషన్‌లోని రికార్డులు, ఫర్నిచర్ శుభ్రం చేశారు. స్టేషన్ ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు, కుండల్లో దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రెడ్డి ఝాన్సీ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాళ్లూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ కార్యదర్శి డి.నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా దోమల వ్యాపి అధికంగా ఉంటుందన్నారు. ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. వీధుల్లో తడి పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఎంపీడీవో ఎస్.సత్యం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు వారి తెగువ టంగుటూరి


పెద్దారవీడు: నివాళులర్పిస్తున్న గ్రంథపాలకులు, స్థానికులు

తాళ్లూరు: తెలుగు వారి తెగువ టంగుటూరి ప్రకాశం పంతులని, బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమి కొట్టడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని మండల స్పెషలాఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీపీ టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఎంపీడీవో ఎస్.సత్యం అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి దేశం కోసం చేసిన సేవ వెలకట్టలేనిదని కొనియాడారు.

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శాఖ గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్ర పటానికి గ్రంథపాలకులు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవల గురించి వివరించారు. స్థానికులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


టంగుటూరికి నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంపీపీ, జెడ్పీటీసీ